క్లుప్తంగా

ఘనంగా గ్రామదేవతల పండుగ



వర్ని: మోస్రా మండల కేంద్రంతో పాటు గోవురు గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో గ్రామదేవతల పండుగను ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా బోనాలను ఊరేగింపు నిర్వహించి గ్రామదేవతలకు సమర్పించారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేత



మాక్లూర్: మండలంలోని ముత్యంపల్లి, అమ్రాద్ గ్రామాలలో నిజామాబాద్ ఉమెన్స్ కాలేజీ విద్యార్థినుల ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ఆదివారంతో ముగిసింది. ఏడు రోజుల గ్రామాల్లో పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ డైరెక్టర్ ధన్‌కాంత్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఆయన చేతులమీదుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె భారతిరెడ్డి, ప్రొగ్రాం అధికారుల ఆర్ మమత, కె మాధవి పాల్గొన్నారు.

భవిష్యత్తులో ఏఐతోనే ఫొటోగ్రఫీ



బోధన్‌టౌన్(బోధన్): ఫొటోగ్రఫీకి భవిష్యత్తులో ఏఐ ఎంతో ఉపయోగపడుతుందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పట్టణ ఫొటో, వీడియోగ్రాఫీ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఫొటో, వీడియోగ్రాఫీ రాష్ట్ర అధ్యక్షులు హుస్సేని ముఖ్య అతిథిగా హాజరై ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఐడెంటీ కార్డులు అందజేశారు. ఫొటో, వీడియోగ్రాఫర్లు రానున్న రోజుల్లో ఏఐ క్లాసులు తప్పనిసరిగా వినాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిమోన్స్, కోశాధికారి సృజన్, వైస్ ప్రెసిడెంట్ ఫేరోజ్ కమిటీ సభ్యులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలో ఇటీవల కాలంలో బాధితులు ఫోన్లను పోగొట్టుకున్నారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీస్ స్టేషన్‌లో ఆదివారం తిరిగి బాధితులకు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ అప్పగించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



సిరికొండ : మండల కేంద్రంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను న్యావనంది గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఉమ్మాజీ నరేష్ వితరణ చేశారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి దుస్తులను విద్యార్థులకు ఆదివారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించి జిల్లాకు రాష్ట్రానికి పేరు తీసుకురావాలని తెలిపారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపి, పాఠశాల ప్రిన్సిపాల్ భోజరాం, పీడీ ప్రశాంత్, ఉపాధ్యాయులు సంజీవ్ ఫీల్డ్ అసిస్టెంట్ గణేశ్, రాజేశ్వర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు నిలయాలు

- కలుషితమవుతున్న తాగునీరు
- రెంజల్ మండలంలో పట్టించుకోని అధికారులు
- గ్రామాల్లో పెరుగుతున్న జ్వర పీడితులు



డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డు పక్కన నిలిచిన మురుగు నీరు



సాటాపూర్ గ్రామంలో ఖాళీ ప్రదేశంలో నిల్వ ఉన్న మురుగు నీరు

రెంజల్(బోధన్): మండలవ్యాప్తంగా ఖాళీ స్థలాలు వ్యాధులకు నిలయాలుగా మారుతున్నాయి. అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారింది. ప్రతి శుక్రవారం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రై డే ను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో ప్రజలు రోగాలబారిన పడుతు ఆస్పత్రుల పాలవుతు ఆర్థికంగా నష్టపోతున్నారు. గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీటితో పాటు మురుగు నీరు చేరడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పందులు, కుక్కలు చేరి వ్యాధుల వ్యాప్తికి కారణమైతుంది. పిచ్చి మొక్కలు పెరిగి ఖాళీ ప్రదేశాల ద్వారా దుర్వాసన వస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి తీవ్ర జ్వరాలకు కారణమవుతున్నాయి. ఇటీవల మండలంలోని బోర్గాం, వీరన్నగుట్ట గ్రామాల్లో డెంగీ కేసులు నమోదయ్యాయి. వారితో పాటు అనేక మంది జ్వర పీడితులు నిత్యం స్థానికంగా ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఖాళీ స్థలంపై పన్ను(వీఎల్‌టీ)ని ప్లాట్ల యజమానులు చెల్లించాల్సి ఉంటుంది. గ్రామాల్లో ఎన్ని ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. వాటి యజమానులు ఎవరు అనే విషయాలను కార్యదర్శులు విస్మరిస్తున్నారు. నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాలలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పైప్‌లైన్‌లకు లీకేజీలు ఏర్పడి కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రత్యేకపాలనలో గాడినపడని పల్లెలు

సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయింది. ప్రభుత్వం ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. నిధుల లేమి వెంటాడటంతో ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించడంలేదు. దీంతో పంచాయతీ కార్యదర్శుల పై పనిభారం పడుతుంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. మండలంలో మురుగు నీటి వ్యవస్థను మెరుగుపర్చిన వారు కరువయ్యారు. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య లోపం కనిపిస్తోంది.

ప్రత్యేకపాలన కుంటుపడింది



ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించినా అభివృద్ధి కుంటుపడుతుంది. స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. నిధుల లేమి పంచాయతీలను వెంటాడుతుంది. కనీస సౌకర్యాలను అధికారులు కల్పించాలి. – తిరుపతి బుజ్జి(హన్మాండ్లు) రెంజల్

కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం

సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించాం. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. – కమలాకర్, ఎంపీడీవో

పోస్ట్‌మార్టం సేవలు పునరుద్ధరించాలి

- రెండున్నరేళ్లుగా బాల్కొండ ఆస్పత్రిలో నిలిచిన సేవలు
- వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని మండల ప్రజల వినతి



మూతబడిన పోస్ట్‌మార్టం గది

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో వైద్యా విధాన్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్లస్టర్ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం సేవలను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో 1990 నుంచి పోస్ట్‌మార్టం సేవలను అందిస్తున్నారు. కాగా, ఆస్పత్రిలో గత రెండున్నరేళ్లుగా పోస్ట్‌మార్టం సేవలను నిలిపివేశారు. ఫోరెన్సిక్ వైద్యుడు లేని కారణంగా పోస్ట్‌మార్టం సేవలను నిలిపివేసినట్లు వైద్యులు చెబుతున్నారు. గతంలో పోస్ట్‌మార్టం సేవలను అందించారు. అప్పుడు ఫోరెన్సిక్ వైద్యుడు లేకుండానే సేవలు నిర్వహించగా, ప్రస్తుతం ఫోరెన్సిక్ వైద్యుడు కావాలని వైద్యులు చెప్పడంపై మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి బాల్కొండ(బాల్కొండ, ముప్కాల్, మెండోరా) మండలం నిర్మల్ జిల్లా సరిహద్దు కేంద్రంగా ఉంది. పోస్ట్ మార్టం సేవలను ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రిలో నిర్వహిస్తున్నారు. జిల్లా సరిహద్దులో ప్రమాదం జరిగి మరణిస్తే 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్మూర్ ఆస్పత్రికి మృతదేహాన్ని పంపించాలి. మృతుల బంధువులకు దూర భారంతోపాటు వ్యయభారం కూడా పెరుగుతుంది. వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బోధన్‌లో కుక్కల బెడద

- రాత్రి వేళల్లో ప్రధాన రహదారిపై గుంపులుగా సంచారం
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బోధన్ ప్రధాన రహదారిపై గుంపులుగా ఉన్న కుక్కలు

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలోని 38 వార్డుల్లో కుక్కల బెడద తీవ్రమైంది. దీంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిన్న పిల్లలను బయటకు పంపాలంటే ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పట్టణంలోని కాలనీల రోడ్లతో పాటు ప్రధాన రహదారులపై పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ఆ దారుల గుండా వచ్చే వారు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు బైపాస్ రోడ్ల పక్కనపున్న కాలనీ శివారుల్లో చికెన్, మటన్ వ్యర్థాలతో పాటు ఇతర వ్యర్థాలు పడేయడంతో కుక్కలు వాటికి కోసం వెళ్తు న్నాయి. ఇటీవల కాలంలో పట్టణంలోని గోషాల కాలనీలో ఓ పిచ్చి కుక్క ఆ దారి గుండా వెళ్తున్న ఐదుగురిపై దాడిచేసి గాయపర్చింది. దీంతో పాటు కాలనీల్లో ఇలాంటి ఘటనలే చోటు చేసుకుంటున్నాయి. సమస్యను పరిష్కరించాలని స్థానికులు బల్దియా అధికారులకు విన్నవించినా స్పందన కరువైంది. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీ శివారుల్లో, బైపాస్ రోడ్ల పక్కన చికెన్, మటన్ వ్యర్థాలను సెంటర్ల నిర్వాహకులు పడేయకుండా బల్దియా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సంఘాలకు ప్రత్యేకాధికారులు

- బాల్కొండ నియోజకవర్గంలో 8 సొసైటీలకు పొడిగింపు ఉత్తర్వులు
- 12 సంఘాల పాలకవర్గాల తీరుతో ఛైర్మన్లకు ఉద్వాసన
- కోర్టును ఆశ్రయించనున్న సంఘాల ఛైర్మన్లు



మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో 12 సహకార సంఘాల పాలకవర్గాలను ఇంటిబాట పట్టించారు. పాలన తీరు బాగులేకపోవడం, సంఘాల ఆర్థికాభివృద్ధి దిగజారిపోవడంతో ఆ సంఘాల పరిపాలనా బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించారు. 8 సంఘాల పాలకవర్గాలకు మాత్రం పొడిగింపు ఉత్తర్వులను జారీ చేశారు. పొడిగింపుకు నోచుకోని సంఘాల ఛైర్మన్లు కోర్టును ఆశ్రయించనున్నట్లు ప్రకటించారు.

ఇద్దరు డీసీసీబీ డైరెక్టర్ల పోస్టులకు ఎసరు...

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లేని సహకార సంఘాల పాలకవర్గాల పొడిగింపుకు బ్రేక్ పడటంతో నియోజకవర్గంలో ఇద్దరు సహకార బ్యాంకు డైరెక్టర్ల పదవులకు గండం ఏర్పడింది. నియోజకవర్గం నుంచి డైరెక్టర్‌లుగా ఎంపికైన రమేష్ రెడ్డి జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన చైర్మన్‌గా ఉన్న వేల్పూర్ సంఘం పాలకవర్గాన్ని పొడిగించారు. బుస్సాపూర్ సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మోర్తాడ్ సహకార సంఘం డైరెక్టర్ మోత్కు భూమన్నలు డీసీసీబీ డైరెక్టర్‌లుగా కొనసాగారు. మోత్కు భూమన్న చైర్మన్‌గా ఎంపిక కాకున్నా ఎస్సీ కోటాలో డీసీసీబీ డైరెక్టర్ పదవికి ఎంపికయ్యారు. మోర్తాడ్, బుస్సాపూర్ సహకార సంఘాల పాలకవర్గాల స్థానంలో ప్రత్యేకాధికారులు కొలువుదీరడంతో ఇద్దరు డీసీసీబీ డైరెక్టర్‌ల పోస్టులకు గండం ఏర్పడింది.

పొడిగించిన సంఘాలు..

- రామన్నపేట్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, ముచ్కూర్, మోతె, వేల్పూర్, పచ్చలనడ్కుడ, రెంజర్ల.

ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్పగించిన సంఘాలు..

- మోర్తాడ్, ఏర్గట్ల, తాళ్లరాంపూర్, శెట్‌పల్లి, బాల్కొండ, వేంపల్లి, బుస్సాపూర్, సావెల్, చౌట్‌పల్లి, కోనసముందర్, కోనాపూర్, పడిగెల్.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే..

సహకార సంఘాల పాలకవర్గాలకు పదవి కాలం పొడగింపు విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించాం. పాలకవర్గాల పనితీరుపై సహకార శాఖ రిజిస్ట్రార్ కోరిన నివేదికను సమర్పించగా కొన్ని సంఘాల పాలకవర్గాలకు పొడిగింపు దక్కలేదు. – శ్రీనివాస్‌రావు, జిల్లా సహకార శాఖ అధికారి

ఉచిత కంటి వైద్య శిబిరం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన స్నేహ లేజర్ ఐ హాస్పిటల్ వైద్యురాలు స్నేహ గ్రామంలోని 130 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి స్వల్ప ధరలో కంటి అద్దాలను, ఉచితంగా మందులను అందజేశారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో మహిళా ఫెస్టివల్



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం మహిళా ఫెస్టివల్ పండుగను ఘనంగా నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మహిళలకు ఆటపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ ప్రభాకర్ మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి మహిళా కమిటీ అధ్యక్షురాలు మృదుశీల, కార్యదర్శి పద్మ, చర్చి కమిటీ ప్రతినిధులు జ్యోతిరాజ్, ఎడ్వర్డ్, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ బాలికల కళాశాలలో ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకుడు గంగాధర్, విద్యార్థులు నిషాంత్, ప్రశాంత్, శ్యాంసుందర్, గణేష్, మధుసూదన్, గుర్రం రాకేష్, వేణు, పట్వారి తులసి, నరేష్ తదితదరులు పాల్గొన్నారు.

17న జాతీయ జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న కోనేరు శశాంక్

రుద్రూర్: ఈ నెల 17న తెలంగాణ విమోచన దినం నేపథ్యంలో అన్నిగ్రామాల్లో జాతీయ జెండా ఎగురవేయాలని బాన్సువాడ సెగ్మెంట్ నాయకులు కోనేరు శశాంక్ పిలుపునిచ్చారు. రుద్రూర్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవ కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. సమావేశంలో మండల స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జి పుట్ట రవిందర్, మండల బీజేపీ అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, నాయకులు గజేందర్, వడ్ల సాయినాథ్, వి. రామ్‌రాజ్, శివప్రసాద్, సాయి ప్రసాద్, వినోద్ కుమార్, కుమ్మరి గణేష్, విజయ్, మరళి, శంకర్ తదితరులున్నారు.

బైపాస్ రోడ్డు పక్కన చెత్త వేయొద్దు



పట్టణ శివారు బైపాస్ రోడ్డులో పరిసరాలను శుభ్రం చేసిన హిందు వాహిని కమిటీ ప్రతినిధులు

బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ బల్దియా ద్వారా ఇంటింటికి సేకరించే చెత్తను బైపాస్ రోడ్డులో వేయకుండా బల్దియా అధికారులు చర్యలు తీసుకోవాలని హిందు వాహిని, బీజేపీ పట్టణ కమిటీ ప్రతినిధులు కోరారు. పట్టణంలోని బాబా గార్డెన్ వద్ద గల బైపాస్ రోడ్డు పక్కన గల వీరభద్రస్వామి విగ్రహం చుట్టు చెత్త చేదారం వేసి స్వామి వారి విగ్రహాన్ని కనపడకుండా చేశారన్న విషయం తెలుసుకున్న హిందు వాహిని, బీజేపీ పట్టణ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఆప్రాంతంలో వేసిన చెత్త చేదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. వీరభద్ర స్వామి విగ్రహం చుట్టూ షెడ్డు వేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు.

ఏఎంసీ పాలకవర్గ సభ్యుల స్టడీ టూర్



బోధన్: బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ఆదివారం మహారాష్ట్ర లోని వ్యవసాయ మార్కెట్ యార్డుల పనితీరును అధ్యయనం చేసేందుకు వాహనంలో బయలుదేరి వెళ్లారు. నాందేడ్, సాంగ్లీ నగరల్లోని మార్కెట్ యార్డుల సందర్శించి అక్కడి పరిస్థితులు, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు,రైతులకు కల్పించిన సదుపాయాలు, ఇతర అంశాలను పరిశీలించనున్నారు.. ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ బి.గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, డైరెక్టర్లు ఆవుల బాలకృష్ణారెడ్డి, సంగెం భూమయ్య, గంగాకిషన్, వెంకటేశ్వర్లు, అంజయ్యసేట్,శ్రీనివాస్,ఉద్యోగులు ఉన్నారు.

జాకోరాలో అస్తవ్యస్తంగా తాగు నీటి సరఫరా



మురుగునీటిలో ఉన్న తాగునీటి పైపులైన్

వర్ని: మండలంలోని జాకోరా గ్రామంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని నాలుగో వార్డులో ఇళ్లలోకి నీటి సరఫరా కాకపోవడంతో గుంతలు తీయగా వాటి మరమ్మతులు చేపట్టకపోవడంతో నెల రోజులుగా అలాగే ఉన్నాయి. మరమ్మతుల కోసం తీసిన గుంతలు పూడ్చకపోవడంతో వల్ల పైపులైన్ లోకి మురుగు నీరు కలిసి కలుషితమైన నీరు సరఫరా అవుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- ముప్కాల్, మెండోరా మండలాల్లో పక్కా భవనాలు నిర్మించని వైనం
- ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు



అద్దె భవనంలో కొనసాగుతున్న ముప్కాల్ పోలీస్‌స్టేషన్

బాల్కొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ముప్కాల్, మెండోరా మండలాలను ఏర్పాటు చేశారు. రెండు మండల కేంద్రాల్లో ఇప్పటికి వరకు కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మించ లేదు. దీంతో ఏడేళ్లుగా కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ముప్కాల్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వీడీసీ భవనంలో, ఎంపీడీవో కార్యాలయం గ్రామ పంచాయతీలో, పోలీస్ స్టేషన్ గంగపుత్ర సంఘంలో, ఎంఈవో, ఏవో కార్యాలయు ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్నాయి. పోలీస్‌స్టేషన్ నిర్వహిస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు పోలీస్ స్టేషన్‌ను ఖాళీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఒక్క ఏడాదికి అద్దెకు తీసుకుని ఏడేళ్లుగా కొనసాగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మెండోరా మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వీడీసీ భవనంలో, ఎంపీడీవో కార్యాలయం పాఠశాలలో, పోలీస్‌స్టేషన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్నారు. మిగతా కార్యాలయాల అడ్రస్ లేకుండా పోయింది. ఇరుకు గదుల్లో ఉండటంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి వెంటనే ప్రభుత్వ కార్యాలయాలకు స్వంత భవనాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించాలి

ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలను వెంటనే నిర్మించాలి. సొంత భవనాలు లేకపోవడంతో ప్రజలు, అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అద్దె భవనాల్లో నిర్వహించడం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం. – ఓ. రమేశ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ముప్కాల్

రైల్వే గేట్ వద్ద గుంతల రోడ్డుతో అవస్థలు



ఎడపల్లిలోని రైల్వే గేట్ వద్ద గుంతలతో ఉన్న బోధన్ - నిజామాబాద్ రోడ్డు

బోధన్: ఎడపల్లి మండల కేంద్రంలోని రైల్వే గేట్ వద్ద బోధన్ నుంచి నిజామాబాద్ వెళ్లే ప్రధాన రోడ్డుకు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఈ రోడ్డు మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాల రవాణా సాగుతుంది. బోధన్ నుంచి నిజామాబాద్‌కు రోజుకు పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా హిందీభాష దినోత్సవం



బోధన్: పట్టణంలోని విజయ సాయి హైస్కూల్‌లో ఆదివారం జాతీయ భాషా హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు హిందీ భాష వర్ణమాల, పదబంధాలు,వారాలు, నెలలు,అంకెలు,ఆటలతో భాషా పరిజ్ఞానం తదితరఅంశాలకు సంబంధించి తయారు చేసిన చార్టులను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్, కృష్ణ మోహన్ ,ఉపాధ్యాయ బృందం చార్టులను పరిశీలించి అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భాషాభిరుచి పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌వో ఐఆర్ చక్రవర్తి, అకడమిక్ ఇన్‌చార్జి సువర్చల, హిందీ టీచర్‌లు సతీష్‌జోషి,జయశ్రీ, గంగాధర్, రేఖ, రజిత తదితరులు పాల్గొన్నారు.